క్లుప్తంగా

స్వాతంత్య్ర సమరయోధుల గురించి తెలుసుకోవాలి



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పాణ్యం: స్వాతంత్య్ర సమరయోధుల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని గ్రంథాలయ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు స్వాతంత్య్ర సమరయోధుల గురించి పోటీ పరీక్ష నిర్వహించారు. ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచి దేశ నాయకులు త్యాగాలను తెలుసుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



పుస్తక పఠనం చేయిస్తున్న లైబ్రేరియన్ కౌసల్య

ఓర్వకల్లు: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని లైబ్రేరియన్ కౌసల్య సూచించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆదివారం నన్నూరు శాఖాలో స్థానిక జెడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కౌసల్య మాట్లాడుతూ కవులు, రచయితలు రచించిన పుస్తకాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతాయని తెలిపారు.

శుభకార్యం



నూతన వధూవరులతో వైఎస్సార్‌సీపీ నాయకులు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలక్ గ్రామానికి వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్న కొండన్న మనువడు వివాహ వేడుక స్థానిక చెన్నసోమేశ్వర స్వామి సన్నిధిలో జరిగింది. మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, కోడుమూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ నాయకులతో కలిసి వివాహ వేడకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండల కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి, కార్యదర్శులు మహానంది, మద్దిలేటి, వెంకటేష్, ప్రభాకర్‌రెడ్డి, ముల్లాహారున్ తదితరులు ఉన్నారు.

కోలుకోలేక విద్యార్థి మృతి

సి.బెళగల్: పాఠశాలకు వెళ్లడంలేదని తండ్రి మందలించడంతో మనస్తాపం చెంది పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విద్యార్థి కోలుకోలేకు మృతి చెందినట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఆదివారం ఎస్‌ఐ తెలిపిన కేసు వివరాలు ఇలా ఉన్నాయి. బీసీ కాలనీలో నివాసము ఉంటున్న కురువ పరమేష్ పెద్ద కుమారుడు శివప్రసాద్ (17) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. అయితే శివప్రసాద్ పాఠశాలకు సక్రమంగా వెళ్లడంలేదని తండి మందలించడంతో ఈనెల 15వ తేదీన ఇంట్లో ఉన్న పురుగుల మందుతాగాడు. కల్లందొడ్డిలో అపస్మారక స్థితి పడిఉండగా గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. కోలుకోలేక విద్యార్థి శనివారం రాత్రి మృతి చెందారు. ఆదివారం మృతుడి తండ్రి పరమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు

కర్నూలు(సెంట్రల్): వన్ టౌన్‌లో నివాసం ఉంటున్న తన భార్య పర్వీన్ ఖాతూన్ (32) కనిపించడం లేదని భర్త పోలీసులను ఆశ్రయించారు. పర్వీన్ ఖాతూన్ ఆదివారం మదరసాలో చదువుతున్న తన కుమారుడిని తీసుకొస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి వద్ద విచారించినా ఆచూకీ తెలియలేదు. దీంతో భర్త అజీం బాషా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అడ్డుగోడ కూల్చివేత

కర్నూలు (టౌన్): స్థానికుల ఫిర్యాదు మేరకు నగరపాలక అధికారులు చర్యలు చేపట్టి రాకపోకలకు అడ్డంగా ఉన్న గోడను తొలగించారు. రెండు రోజుల క్రితం ఇదే సమస్యపై స్థానిక ప్రజలు నగరపాలక ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ ప్రాంతాన్ని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబుతో పాటు మున్సిపల్ ఎస్ఈ రాజశేఖర్ పరిశీలించారు. అడ్డుగోడ వల్ల బిర్లా గేట్ నుంచి సిల్వర్ జూబ్లీ కళాశాలకు వెళ్లే ప్రజలు, ఆటోలు, వాహనాదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న ఒకే రహదారి పోస్టాఫీసు మీదుగా వెళ్తుండటంతో నిరంతరం రద్దీగా ఉంటోంది. డీఐజీ, ఇతర ఉన్నతాధికారులు సైతం ఇదే రహదారి గుండా వెళుతుంటారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. స్థానికుల ఫిర్యాదు మేరకు స్పందించిన నగరపాలక అధికారులు.. జిల్లా పరిశ్రమల కేంద్రం వద్ద ఉన్న అడ్డుగోడను ఆదివారం సాయంత్రం తొలగించారు. దీంతో ఇరువైపులా రాకపోకలు సాగించేందుకు వీలు కలిగింది. దీంతో కలెక్టరేట్, కృష్ణానగర్ నుంచి వచ్చే వాహనాదారులు చుట్టూ వెళ్లకుండా ఖనా-ఖజానా రహదారి మీదుగా సిల్వర్ జూబ్లీ కళాశాల, డీఐజీ ఆఫీసు, దిన్నెదేవరపాడు రోడ్డుకు వెళ్లేందుకు లైన్ క్లియర్ అయ్యింది.

రబీ సాగు ప్రశ్నార్థకమే!

- చెరువుల్లో నీరు అంతంత మాత్రమే
- ఆందోళన చెందుతున్న రైతులు
- వలసలు తప్పవంటున్న వ్యవసాయ కూలీలు



కొద్దిపాటి నీటి నిల్వ ఉన్న సి.బెళగల్ చెరువు

సి.బెళగల్: ఖరీఫ్ సాగు రైతులకు కలిసి రాలేదు. రబీ సాగు సైతం ప్రశ్నార్థంగా మారింది. రబీ సీజన్ ముగింపునకు వస్తున్నా సాగుకు సాహసం చేయడం లేదు రైతులు. వర్షపాతం చాలా తక్కువగా నమోదైంది. దీంతో చెరువులు నీరులే వెలవెలబోతున్నాయి. సి.బెళగల్ మండలంలో సంమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో చెరువుల్లో అంతంత మాత్రమే నీరు ఉంది. దీంతో వరి సాగు చేసేందుకు రైతులు జంకుతున్నారు. వరిమడులు బీడులుగా మారాయి. మండలంలోని బ్రాహ్మణదొడ్డి, సి.బెళగల్ చెరువులకు మాత్రం ఎత్తిపోతల పథకాల ద్వారా కొంతమేర నీటిని మళ్లింపు చేపట్టారు. అయినా ఆ చెరువులలోనూ తక్కువ స్థాయిలో నీటి నిల్వలు ఉన్నాయి. పలుకుదొడ్డి చెరువులో నీరు పూర్తిగా లేదు. వరి పంటల సాగుకు అవసరమైన మేర నీటి నిల్వలు లేకపోవడంతో తిండిగింజలు ఇబ్బంది తప్పదనే పరిస్థితి నెలకొంది. మండలంలోని ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన జూన్ నెల నుంచి అక్టోబర్ వరకు లోటు వర్షాపాతం నమోదు అయినట్లు తెలుస్తోంది. జూన్ నెల నుంచి అక్టోబర్ వరకు సాధారణ వర్షాపాతం 516.5 మిల్లీ మీటర్లుగా ఉండగా నెలవారి సరాసరి 103.3 ఎంఎం నమోదు అయ్యింది. కురిసిన వర్షాపాతం మొత్తం 447.4 ఎంఎంగా ఉండగా, నెలవారి సరాసరి 89.48 ఎంఎంగా నమోదు అయ్యింది. మొత్తంగా 13.83 ఎంఎం లోటు వర్షాపాతం కురిసినట్లు అధికారక నివేదికలు. అయితే ఖరీఫ్ పంటలకు అదునుగా

చెరువుల సాగు విస్తీర్ణం ఇలా....

చెరువుపేరు	చెరువు విస్తీర్ణం	సాగు భూమి (ఎకరాలలో)
సి.బెళగల్	1,943	353
పలుకుదొడ్డి	400	58
బ్రాహ్మణదొడ్డి	44	52

భావించే జూలై నెలలో సాధారణ వర్షాపాతం 90.8 ఎంఎం ఉండగా, 64.8 ఎంఎం మాత్రమే వర్షం కురిసింది. అదేవిధంగా సెప్టెంబర్‌లో 121.6 ఎంఎంకు 111.6 ఎంఎం వర్షం కురిసి లోటు ఏర్పడింది. మండలంలో పంటలకు అవసరమైన సరైన వర్షాలు కురవకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వమే చెరువులకు సాగునీటిని విడుదల చేయించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

బీళ్లుగా వందల ఎకరాలు

చెరువుల్లో నీరు లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. అరకొరగా ఉన్న నీరు సాగుకు అందుతుందో లేదో అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు రైతులు. వరి నాటాక సాగునీరు అదకపోతే పెట్టుబడి కూడా రాదనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వరి సాగుకు రైతులు ముందుకు రావడం లేదు. దీంతో వందల ఎకరాలు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. కొందరు రైతులు సాహసం చేస్తున్నప్పటికీ చాలా వరకు వెనుకంజ వేస్తున్నారు. బ్రాహ్మణదొడ్డి, సి.బెళగల్ చెరువులకు కొంతమేర నీరు ఉండడంతో సమీప రైతులు వరి సాగుకు సిద్ధం అవుతున్నారు. రబీ సాగు ప్రశ్నార్థకంగా మారడంతో ఈ యేడు వలసలు తప్పవంటున్నారు వ్యవసాయ కూలీలు.



పలుకుదొడ్డిలో బీళ్లుగా సాగు భూములు

ప్రభుత్వమే ఆదుకోవాలి



గతేడాది ఈపాటికి కొద్దిపాటి వర్షాలు కురిసి చెరువులోకి నీరు వచ్చింది. కాని ఈ ఏడాది కాలం అయిపోతునా చెరువులలో పంటలకు సరిపోయే లేదు. చెరువు కింది వరిసాగు చేసే వరుమడులనీ బీళ్లుగా మారాయి. ఉన్న కొంతనీటి నిల్వలతో రైతులు వరి పంటలను సాగు చేసుకునేందుకు పూనుకుంటున్నారు. ప్రభుత్వమే చొరవతీసుకుని చెరువులకు సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

–బలిగేరి వెంకటేష్, సి.బెళగల్ రైతు

తిండిగింజలు కష్టమే



వానకాలం వానలతో చెరవులు నిండేవి. మా ఊరి చెరువులో వాననీరు ఎక్కిపారితే చెరువు సమీపంలోని రైతులు రెండకార్లు వరిపంటను పండించే వాళ్లం. ఇప్పుడేమో ఒక్కపంటకు కూడ నీరు దిక్కులేదు. ఈ ఏడాది తిండి గింజలకు కూడా కష్టంగానే ఉంది. బతకడానికి వలసలు వెళ్లిపోవాల్సిందే. చెరువుకు కాలువనీళ్లు మళ్లించి నింపాలని అధికార యంత్రాంతాన్ని కోరుతున్నాం.

–చిన్న హనుమంతు, పలుకుదొడ్డి రైతు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



గతేడాదితో పోల్చుకుంటే ఈ సంవత్సరం మండలంలో వర్షాలు బాగా కురిశాయి. చెరువులకు కొంతమేర నీరు చేరింది. అయితే చెరువులు పూర్తిగా నిండలేదు. చెరువు కింద వరి సాగు రైతులు ఈఏడాది భూములను బీళ్లుగాగా పెట్టుకున్నారు. పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈఏడాది కొంత వరకు చెరువులకు సాగునీరు అందించేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

– సూర్యప్రకాష్, ఇరిగేషన్ ఏఈ

పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి సూచించారు. అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై వినతులు అందజేస్తే పరిష్కార చర్యలు తీసుకుంటామన్నారు.

ఉత్సాహంగా భగవద్గీత పోటీలు

కర్నూలు కల్చరల్: చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని చిన్మయ ప్రభావళిలో ఆదివారం జిల్లా స్థాయి భగవద్గీత పఠన పోటీలు నిర్వహిహించారు. చిన్మయ మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి అధ్యక్షతన ఆరు గ్రూప్‌ల్లో పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలకు మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్, చిన్మయ మిషన్ అధ్యక్షుడు విజయకుమార్ రెడ్డి, కార్యదర్శి టీవీ రత్నప్రసాద్, ఉపాధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు, ఆవోపా చీఫ్ నాగేశ్వరరావు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

పోక్సో కేసు నమోదు

కర్నూలు(సెంట్రల్): బాలికను లైంగికంగా వేధించిన అజయ్ అనే వ్యక్తిపై రెండో పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నగరంలోని చదువుల రామయ్య నగర్‌లో నివాసం ఉంటున్న 17 ఏళ్ల బాలికను నిందితుడు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి లైంగికంగా వేధించాడు. ఈ మేరకు ఫిర్యాదు అందుకున్న రెండో పట్టణ పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



రైతులతో కలిసి పంటలను పరిశీలిస్తున్న అధికారులు

కర్నూలు(రూరల్): ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని, భూసారం సైతం పెరుగుతుందని ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. పకృతి వ్యవసాయ పద్ధతులు పాటించి పండించిన దిగుబడులు వాడితే ఆరోగ్యంగా ఉంటారన్నారు. మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామంలో ఆదివారం మాస్టార్ ట్రైనర్ ఆంజనేయులతో కలిసి ఆయన పకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనతరం గ్రామంలోని మరేమ్మ గుడిలో జీవామృతం తయారీపై ట్రైనర్ ఆంజనేయులు రైతులకు అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ మేనేజర్‌తోపాటు మండల సమైక్య అధ్యక్షురాలు అరుణమ్మ పకృతి వ్యవసాయం ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ సాగులో విచ్చలవిడిగా రసాయన మందులు వాడడం మూలంగా దిగుబడులు కలుషితం కావడంతోపాటు నేలలోనూ సారం తగ్గుతోందన్నారు. పకృతి వ్యవసాయం దిగుబడులు ఆరోగ్యరమని, ఆ దిశగా రైతులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా పంటమార్పిడి తప్పనిసరిగా పాటించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సందిప్ కూమర్, నాచురల్ ఫార్మింగ్ అసోసియేట్స్ జగదీష్, మల్లికార్జున, భుజేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

26న రైతు కార్మిక సంఘాల మహాప్రదర్శన



మాట్లాడుతున్న కె.ప్రభాకరరెడ్డి

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా అవలంభిస్తున్న చర్యలను ఖండిస్తూ నవంబర్ 26వ తేదీన మహాప్రదర్శన, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించాలని రైతు రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం వేర్‌హస్ హమాలీ యూనియన్ బాడీ సమావేశం కార్మిక, కర్షక భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతులు, కార్మికుల కడుపు కొడుతుందని విమర్శించారు. హక్కుల కోసం పోరాటాల్లో భాగంగా నవంబర్ 26న అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రంలో ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు చెప్పారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నరసింహులు, నాయకులు విష్ణుమూర్తి, సుధాకర్, మధు, రంగన్న, గోవిందు, ఇషాక్, విజయుడు పాల్గొన్నారు.

ఫారెస్ట్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలోని క్లబ్ క్యాంటీన్‌లో ఆదివారం ఏపీ జూనియర్ ఫారెస్టు అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశంలో కర్నూలు యూనిట్ అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ కలాం, కార్యదర్శిగా మౌలాలి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రతిదేవి, జాయింట్ సెక్రటరీగా కాళిదాస్, కోశాధికారిగా అనురాధను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు, శశిభూషణ్ వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా పరిధిలో అటవీ సంరక్షణకు కృషి చేస్తామన్నారు.

కొత్తూరులో భక్తులు సందడి

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మస మూడవ ఆదివారం భక్తులు సందడి నెలకొంది. స్వామివారి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు క్యూకట్టారు. స్వామి వారికి ఇష్టమైప చలివిపిండి, పాలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివారిని దర్శించుకునేందుకు మూడు గంటలకుపైగా పట్టిందని భక్తులు తెలిపారు.



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యేశ్వరస్వామి

భోగేశ్వరంలో....

గడివేముల: దుర్గాభోగేశ్వరాలయం భక్తులతో సందడిగా మారింది. పంచకోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ దుర్గాభోగేశ్వరుడి దర్శించుకుని అభిషేకం,అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేపట్టారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈఓ రామానుజన్ పర్యవేక్షించారు. పూజల అనంతరం భక్తులు కాశీనాయన ఆశ్రమంలో అన్నదానం స్వీకరించారు.



భోగేశ్వరాలయ ప్రాంగణంలో కార్తీకదీపాలను వెలిగిస్తున్న మహిళలు,

బుగ్గరామేశ్వరుని సన్నిధిలో లోకాయుక్త జడ్జి

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వరస్వామిని ఆదివారం ఏపీ లోకాయుక్త జడ్జి రజనీ దంపతులు దర్శించుకున్నారు. జడ్జి దంపతులు స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని ఈఓ మద్దిలేటి, ఆలయ అర్చకులు లక్ష్మినారాయణశర్మ ఆలయ మర్యాదలతో సత్కరించారు.



జడ్జి దంపతులను సత్కరిస్తున్న ఆలయ ఈఓ మద్దిలేటి

14న తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని ధర్మపేటలో వచ్చే నెల 14, 15 తేదీల్లో అండర్-14 విభాగంలో సబ్ జూనియర్ క్యాడెట్, జూనియర్, సీనియర్ విభాగాల్లో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించనున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్వగృహంలో పోటీలకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మాస్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సహకార సేవలను సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు: సహకార సంఘాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డివిజనల్ సహకార అధికారి జఫ్రీన్ సూచించారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలలో భాగంగా ఆదివారం మండల కేంద్రం ఓర్వకల్లు ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఈఓ మద్దిలేటి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి జఫ్రీన్‌తో పాటు, పర్సన్ ఇన్‌చార్జ్ రామకృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ మున్వర్ బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా జఫ్రీన్ మాట్లాడుతూ సహకర సంఘంలో సభ్యత్వం తీసుకున్న రైతులు తప్పనిసరిగా తమ ఓటుహక్కును రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి, సంఘం అభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. రైతుల అవసరం మేరకు ఉన్నతాధికారులతో మాట్లాడి ఎరువులు, నీళ్ల మందులను అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గోవింద్‌రెడ్డి, లక్ష్మికాంతారెడ్డి, చిన్న ఎల్లారెడ్డి, రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డివిజనల్ సహకర అధికారి జఫ్రీన్

కొత్త కాలనీలో సమస్యల తిష్ట!

- పిచ్చిమొక్కల మధ్య జీవనం సాగిస్తున్న కాలనీవాసులు
- వీధిలైట్లు..అంతర్గత రోడ్లు లేక ఇక్కట్లు



ముళ్లపొదలు,పిచ్చిమొక్కలతో నిండిపోయిన రామాపురం కొత్తకాలనీ

కోడుమూరు రూరల్ : కోడుమూరు నుంచి వెల్దుర్తికి వెళ్లే దారిలో లద్దగిరి గ్రామం తర్వాత ప్రధాన రోడ్డు నుంచి రెండు కిలోమీటర్లు లోపలికి వెళితే రామాపురం గ్రామం వస్తుంది. గ్రామంలో సుమారు 400కుటుంబాలకుపైగా ప్రజలు జీవనం సాగిస్తున్నారు. వీరిలో 150 కుటుంబాలు పాత ఊరునువదిలేసి కొత్తగా రోడ్డుకు దగ్గరగా ఉన్న కాలనీలో 20ఏళ్ల కిందట ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో గృహాలు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే ఇల్లు నిర్మించుకుని ఏళ్ల గడుస్తున్నా కనీస మౌలిక వసతులైన అంతర్గత రోడ్లు, వీధిలైట్లు, తాగునీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల ఎదుట అంతర్గత రహదారులను నిర్మించకపోవడంతో దారులన్ని ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. ఏపుగా పెరిగిన కంప చెట్లు, పిచ్చిమొక్కల వలన నిత్యం విషపురుగులు సంచరిస్తుండడంతో ప్రజలు భయం భయంగా జీవనం సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు.

ప్రాథమిక పాఠశాలకు గ్రహణం

రామాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు గ్రహణం పట్టింది. పాఠశాల శిథిలావస్థకు చేరడంతో తొలగించి కొత్తగా నిర్మిస్తున్నారు. అయితే పాఠశాల నిర్మాణం ఏళ్లతరబడి నత్తనడకన సాగుతోంది. దీంతో కొద్ది కాలం గ్రామంలోని శివాలయంలో పాఠశాలను కొనసాగించిన అధికారులు ప్రస్తుతం రోడ్డుకు దగ్గరగా నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల ఆవరణంలోని సుంకులమ్మ గుడి వద్ద పాఠశాల తరగతులను నిర్వహిస్తున్నారు. అయితే మౌలిక వసతుల్లేక చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను లద్దగిరి, వెల్దుర్తిలోని పాఠశాలలకు పంపుదుతున్నారు. దీంతో స్థానిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఒకే ఒక్క ఉపాధ్యాయుడు 1నుంచి 5వతరగతి విద్యార్థులకు విద్యను బోధించాల్సిన పరిస్థితి.



అంతర్గత రోడ్లు లేక పిచ్చిమొక్కలతో నిండిపోయిన రస్తాలో వెళ్తున్న ప్రజలు



ఇళ్ల ఎదుట వీధిలైట్లు, రోడ్డు, మురుగు కాల్వలు లేని దృశ్యం

ఇబ్బందులు పడుతున్నాం



ఇళ్లు కట్టుకుని ఏళ్ల గడుస్తున్నా మా వీధిలో ఇంత వరకు మట్టి రోడ్లు కూడా వేయలేదు. ఏ ఇంటి ఎదుట సరియైన దారి లేదు. దారులన్నీ ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయాయి. పగలు రాత్రి తేడా లేకుండా విషపురుగులు తిరుతుంటాయి. కనీసం వీధిలైట్లు వేయించాలని విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు.

–మహేష్, రామాపురం గ్రామం, కోడుమూరు మండలం.

ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి



మా ఇళ్ల ఎదుట రోడ్లు, మురుగునీటి కాల్వలు లేవు. వీధిలైట్లు కూడా సరిగా లేవు. వానలకు ఇళ్లట్టూ గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. చీకటి పడితే విషపురుగుల భయంతో బయటకు రాలేని పరిస్థితి. రోడ్లు, కాల్వలు నిర్మించాలని కోరుతున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. భయపడుతూ జీవనం సాగిస్తున్నాం.

–పుష్పావతి, రామాపురం గ్రామం, కోడుమూరు మండలం.

కళాకారులకు దుస్తుల పంపిణీ



మాట్లాడుతున్న డాక్టర్ సుభాన్

కర్నూలు కల్చరల్: జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో 20 మంది మహిళా కళాకారులు, 10 మంది పురుష కళాకారులకు దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేశారు. దాత డాక్టర్ ఎస్.జి.ఎం. సుభాన్ ఆర్థిక సహకారంతో కార్యక్రమం నిర్వహిహించినట్లు సంఘం అధ్యక్షుడు గుర్రపు శాల అంకయ్య తెలిపారు. బీసీ సంఘం జాతీయ నాయకులు నక్కలమిట్ట శ్రీనివాసులు, సీనియర్ కళాకారులు దస్తగిరి, బైలుప్పల షఫి, కేవీ సుబ్బారెడ్డి తదితరులు కళాకారులకు దుస్తులను పంపిణీ చేశారు.

యాదవులు ఐక్యంగా ఉండాలి

కర్నూలు కల్చరల్: యాదవులందరూ ఐక్యంగా ఉండి ఆర్థికంగా రాజకీయంగా ఎదగాలని సంఘం పెద్దలు డాక్టర్ బాల మద్దయ్య, ఏపీ రామయ్య యాదవ్, నాగరాజు యాదవ్ సూచించారు. ఆదివారం నగర శివారులోని జగన్నాథగట్టుపై యాదవుల కార్తీక వనభోజన కార్యక్రమం జరిగింది. నగరంలో ఏర్పాటు చేయబోయే యాదవ భవన్‌కు టీడీపీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ రూ.లక్ష విరాళం ప్రకటించారు. చిన్నారులు, మహిళలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఓంకార్ యాదవ్, ఎర్రదొడ్డి రాముడు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.